# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఈశాన్య రాష్ట్రాల్లో 55 వేల 600 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.**
2. **రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు బాపట్ల జిల్లాలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు.**
3. **సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరుతున్నాయని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు.**
4. **కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాదిమంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి తెలిపారు.**
5. **రాష్ట్రంలో ఈరోజు జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10 మంది మరణించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్‌లలో 55 వేల 600 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో నిర్వహించిన ఒక బహిరంగ సభ నుంచి ప్రధానమంత్రి దృశ్యమాధ్యమం ద్వారా ఈ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను నిర్వహించారు. వీటిలో ఉన్నతి పథకం కింద సుమారు 10 వేల కోట్ల రూపాయలతో నిర్మించిన సేలా సొరంగ మార్గం కూడా ఉంది. 8 ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి పనులకు పూర్తి నిధులను ఉన్నతి పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ ఈశాన్య ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి ఉన్నతి పథకం దోహదపడుతోందన్నారు. సేలా సొరంగ మార్గం ప్రాజెక్టును ఇంజనీరింగ్ అద్భుతంగా ప్రధాని అభివర్ణించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బలిపర–చరిదువార్–తవాంగ్ రోడ్డు మార్గంలో అన్ని కాలాల వాతావరణ పరిస్థితుల్లోనూ రాకపోకలకు సేలా సొరంగమార్గం దోహదపడుతుందన్నారు.

--------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడులో నిర్వహించే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో పాల్గొంటారు. కార్యక్రమానికి పోలీసు ఉన్నతాధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ నేపథ్యంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను రేపు ఉదయం 10 గంటల నుంచి దారి మళ్లిస్తున్నట్లు బాపట్ల

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. చిత్తూరుజిల్లా నింద్ర మండలం నెట్టేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, విజయపురం మండలం ఆలపాకం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో 20కిపైగా సచివాలయాలను నూతనంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని తిరుపతి పార్లమెంటు సభ్యులు ఎన్.గురుమూర్తి తెలిపారు. తిరుపతి బస్టాండ్ ఎదురుగా ఉన్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ఆయన ఈరోజు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీలో భాగంగా తిరుపతి నగరంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని..భక్తులతో పాటు స్థానికుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రైల్వే అండర్ బ్రిడ్జ్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొనారు.

---------------------------

తమ ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకుంటోందని రాష్ట్ర భూగర్భ, విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరుజిల్లా పుంగనూరులో వ్యవసాయ భూముల దరఖాస్తు పట్టా పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క రైతు నష్టపోలేదని.. ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా రైతులకు చేయూత అందించామని తెలిపారు.

---------------------------

గ్రూప్-1 ప్రాథమిక (ప్రిలిమ్స్) పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్ సైట్ నుంచి హాల్‌టికెట్లను రేపటి నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 17వ తేదీన నిర్వహించే ఈ పరీక్షకు రాష్ట్రంలో 301 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఏపీపీఎస్సీ నిన్న ప్రకటించింది. ఒక లక్షా 48 వేల 881 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో దృశ్యమాధ్యమం ద్వారా ముఖాముఖి నిర్వహించను న్నట్లు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార, ఆర్థిక సేవా సంస్థ నిన్న ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'ప్రధానమంత్రి సు-రాజ్' పేరిట ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్టు వివరించింది. ఈ సందర్భంగా నమస్తే పథకం ద్వారా ఎంపికైన పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత భద్రత (పీపీఈ) కిట్లు, ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతమవుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి చెప్పారు. తిరుపతిలో ఈరోజు కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె

మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తున్న విషయాన్ని గ్రామ గ్రామాన ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్రం లోనూ లక్షలాదిమంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10 మంది మరణించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ మండలం దుమ్ముగూడ వద్ద గత రాత్రి మూడు బైకులు ఢీకొనడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరంతా శివరాత్రి జాతర నుంచి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

అలాగే, శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం దాడితోట గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మరణించారు. ఇద్దరూ శివరాత్రి ఉత్సవాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో 20 మంది మిర్చి కూలీలతో వెళ్తున్న వాహనాన్ని బొలేరో వాహనం ఢీకొనడంతో డ్రైవర్‌తోపాటు ఒక కూలీ మృతిచెందాడు. అలాగే, శ్రీశైలం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి వెళ్తున్న కారును ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో లారీ ఢీకొనడంతో మరొక వ్యక్తి మరణించారు.

---------------------------

విజయనగరం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న రామతీర్థం భక్తులతో కిటకిటలాడింది. సాక్షాత్తు శ్రీరాముడే ఇక్కడ శివుని తారక మంత్రం జపించారని భక్తుల నమ్మకం. అందుకే ఏటా శివరాత్రి పర్వదినం నాడు రాత్రంతా ఇక్కడ వేలాది మంది భక్తులు జాగారణ చేస్తుంటారు. శ్రీరామస్వామివారి ఆలయం, ఉమా సదాశివ ఆలయం, రామకోనేరు, బోడి కొండ, గురుభక్తుల కొండ, దుర్గాభైరవ కొండ తదితర ప్రాంతాలన్నీ భక్తజనంతో కిక్కిరిశాయి. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్షేత్రంలో సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మరోవైపుట.. శృంగవరపుకోట మండలం పుణ్యగిరిలో కొలువైన ఉమా కోటిలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

---------------------------

మహిళలు శారీరక, మానసిక, ఆరోగ్య, రాజకీయంగా , ఆర్థికంగా బలోపేతం అవ్వడమే మహిళా సాధికారితకి నిజమైన నిదర్శనం అని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డా కె.మాధవీలత పేర్కొన్నారు. రాజమహేంద్రవరం, కంబాల చెరువు సమీపంలోనీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా విభాగం వైద్యులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "స్ఫూర్తి ప్రదాత" ర్యాలీనీ ఆమె నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ ఇతిహాస పురాణ కాలం నుంచి మహిళలకు సముచితమైన స్థానం లభిస్తోందని అన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలను ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల మహిళల్లో అవగాహన కలుగ చేసే కార్యక్రమాలను నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న ఐ ఎమ్ ఎ మహిళా విభాగం వైద్యులను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసు పరిధిలో నవంబరులో ఆర్మీరిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతుందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 వరకూ

దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని, ఆర్మీ అధికారిక వెబ్ సైట్ **www.joinindianarmy.nic.in**లో పూర్తి వివరాలు వుంటాయని తెలిపారు. గ్రామస్థాయి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చే నవంబరు మాసంలో గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ పరిధిలోని గుంటూరు జిల్లా మొదలు రాయల సీమ జిల్లాలు కలిపి 13 జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

---------------------------

భారత్–ఇంగ్లండ్ ఐదో టెస్టు క్రికెట్ మ్యాచ్లో భారత్ విజయం దిశగా కొనసాగుతోంది. ధర్మశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 218 పరుగులకు ఆలౌట్ అవగా, భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 477 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ప్రస్తుతం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 141 పరుగులు చేసి ఎనిమిది వికెట్లు కోల్పోయింది.

=======================